రామ చంద్రమూర్తిగారి వివాహ స్వర్ణోత్సవాలు, అపూర్వ సంఘటనలా, పెద్ద పండగలా జరిగాయి. కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనవలు మనవరాళ్లు, బంధు మిత్రులు, అభిమానులు అందరూ వచ్చారు. ఇల్లంతా చెప్పలేనంత సందడి. ఎక్కడెక్కడినుంచో అభినందన సందేశాలు అందాయి. గతంలో తనతో కలిసి పని చేసిన వారు, దేశదేశాలలో జరిగిన సమావేశాలలో కలిసిన మిత్రులు, ఇంకా ఎందరో ఈ శుభ సందర్భంగా అభినందన సందేశాలు పంపించారు.





# ఒంటరితనం

– గోవాడ సత్యారావు

ఈ ఉత్సవాలకు ఇంటి దగ్గర పెద్ద షామియానా వేశారు. పెళ్ళి జరిగినంత కోలాహలంగా ఉంది. శ్రీ రామచంద్రమూర్తి, సీతమహాలక్ష్మమ్మగార్ల వివాహ స్వర్ణోత్సవం సీతారాముల కళ్యాణం అంత వైభవంగా జరిగింది. కొడుకులు, కోడళ్ళు, కూతుళ్లు అల్లుళ్లు, మనవలు మనవరాళ్లు అందరూ దగ్గర ఉండి ప్రతి ఒక్క వేడుకను సంప్రదాయబద్ధంగా జరిపించి, ఆనందంతో కేరింతలు కొట్టారు. నాటికీ నేటికీ తేడా ఒకటే. ఆనాడు కన్యాదానం చేసిన దంపతులు ఈనాడు లేరు. ఆనాడు ఇంకా జన్మించని కొడుకులు, కూతుళ్ళు, మనవలు, మనవరాళ్ళు ఈనాడు ఉన్నారు.

కూతుళ్ళు, కోడళ్లు స్వయంగా సీతమహాలక్ష్మమ్మను పెళ్లి కూతురుగా ముస్తాబు చేశారు. రకరకాల నగలతో అలంకరించారు. వల్లెవాటు వేశారు. బుగ్గన చుక్క పెట్టారు. కళ్యాణ బొట్టు పెట్టారు. బాసికం కట్టారు. తలంతా ముగ్గు బుట్టలా అయినా చక్కని అందం, వయసు తగ్గ హుందాతనం ఉట్టిపడుతున్నాయి. పదేళ్ళ వయస్సులో పెళ్ళి ముస్తాబుకు ఏమేమి చేశారో గుర్తులేని ఆమెకు ఇదంతా కొత్త అనుభూతి. తన కూతుళ్లకు తనూ ఇలాగే అలంకారం చేసింది.అది తనకూ ఆనందం కలిగించినా, తనే పెళ్లి కూతురన్న అనుభూతి ఏదో అనిర్వచనీయంగా తోస్తోంది.

రామచంద్రమూర్తిగారినీ పెళ్లి కుమారుడుగా చక్కగా ముస్తాబు చేశారు.

పూజలు, పునస్కారాలు, క్రతువులు, అభిషేకాలు ఒక పక్కన జరుగుతున్నాయి. పురోహితుడు 'వివాహం' జరిపిస్తున్నాడు. సీతమహాలక్ష్మమ్మను బుట్టలో పెట్టి తీసుకురాలేదు కాని, కొబ్బరి బొండాం చేతులలో ఉంచుకొని ఆమె కళ్యాణ వేదికకు నడిచి వచ్చారు. కూతుళ్ళు, కోడళ్ళు, ఇతర ముత్తయిదువులు వెంట ఉండి తీసుకువచ్చారు. సిగ్గుతో తలవంచుకొని రాలేదు కాని, తలెత్తుకునే ముసిముసి నవ్వులతో ఠీవిగానే నడిచి వచ్చారు. "సిగ్గు నటించాలండీ సీతమ్మగారూ"! అంటూ అమ్మలక్కలు చతురోక్తులాడుతున్నారు. కళ్యాణ మండపంలో వేంచేసి ఉన్న విష్ణురూపి అయిన వరరత్నం శ్రీ రామచంద్రమూర్తి సమక్షంలో కూర్చొని శ్రీ మహాలక్ష్మి రూపి అయిన సీతమహాలక్ష్మమ్మగారు కొబ్బరి బొండాన్ని అతనికిచ్చి ఆత్మదానం చేసుకున్నారు. అతను ఆనందంతో స్వీకరించాడు. అందరూ చప్పట్లు కొట్టారు.

మంగళసూత్రధారణ, తలంబ్రాలు, బువ్వబంతులు, చదివింపులు, ఒకటేమిటి, అన్ని వేడుకలూ యధావిధిగా జరిపించి, వారి సంతానం, ఎంతో ఆనందించారు. కొడుకులు, కూతుళ్లు కూడా విలువైన కానుకలు బహూకరించారు. బంధుమిత్రులు, సహచర బృందం ఎన్నో జ్ఞాపికలు యిచ్చారు. 'వివాహం' కాగానే అందరూ 'నూతన' దంపతులను అభినందించారు. ఆశీర్వదించగల వయస్సు లేదు వారికి.



ఒకవ్యక్తి: నా భార్య ఏ విషయంపైనైనా రెండు గంటలు అనర్గళంగా మాట్లాడగలదు!
రెండవ వ్యక్తి: ఒహో! నా భార్య విషయమేమీ లేకపోయినా నాలుగు గంటలు అనర్గళంగా మాట్లాడేయగలదు తెలుసా?

-జయంత్
నార్కట్‌పల్లి

వివాహ వేడుకలు ముగిశాక, సాయంత్రం అభినందన సభ విందు జరిగాయి. రామచంద్రమూర్తిగారు చేసిన బహుముఖ సేవలను ఎందరో ప్రస్తుతించారు. ప్రముఖుల సందేశాలు చదివి వినిపించారు.

ఐదు దశాబ్దాల క్రితం, తమ పసితనంలో జరిగిన వివాహ వేడుకలు వారికి లీలా మాత్రంగానే గుర్తున్నాయి.

— — — —

ఒక రోజు—

సాయంత్రం పెరట్లో కూచొని ఏదో గ్రంథం చదివి భార్య మంగమ్మ గారికి వివరిస్తున్న వెంకటచలం గారితో ఆయన బావమరిది ఏదో ప్రస్తావన చేశారు. మంగమ్మగారు ఈ ప్రస్తావనను సమర్థించారు. అప్పటి వరకు కొడుకు వివాహ విషయం ఆలోచించని వెంకటచలం గారు, అభ్యంతరం చెప్పలేదు. సరేనన్నారు. రామచంద్రమూర్తి ఫోర్త్ ఫారం చదువుతున్నాడు. సీతమహాలక్ష్మి ఐదో క్లాసు పాసై చదువుమాని వేసింది, ఇంట్లో పనీపాటలలో తల్లికి చేదోడుగా ఉంటున్నది. వారి పెళ్లిని గురించి వారి అభిప్రాయం ఎవరూ అడగనూ లేదు. అసలు పెళ్లంటే ఏమిటో పూర్తిగా తెలియని వయస్సు గనుక, వారికో ప్రత్యేకమైన స్వంత అభిప్రాయం ఉండే ప్రసక్తే లేదు. పెద్దలు నిర్ణయించారు. సీతరాముల కళ్యాణం వైభవంగానే జరిగిపోయింది.

చిన్నతనం నుంచీ, 'బావా బావా!' అంటూ వెంటతిరిగిన సీతమహాలక్ష్మి ఇప్పుడు అతని భార్య. వారిద్దరి సంబంధంలో మార్పు వచ్చినా, వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. తను చిన్నప్పటి నుంచి పిలుస్తున్నట్లుగానే ఇప్పటికీ "సీత !" అనే పిలుస్తుంటాడు. ఆమె కూడా ఇప్పటికీ "బావా!" అనే పిలుస్తుంది.

పెళ్లయిన నాలుగేళ్లకు ఓ మంచి ముహూర్తాన సీతమహాలక్ష్మి కాపరానికి వచ్చింది. అంటే, తమ యింట్లో ఉంటూ, రెండిళ్లవతల బావ గారింటికి వెళ్లివస్తున్న సీతమహాలక్ష్మి హెడ్ క్వార్టర్స్ మారిపోయింది.

అప్పటిదాకా ఇంటిపనులలో తల్లికి తోడుగా ఉండి, వంటా వార్పులలో ఆరితేరిన తన హోదాను కూతురునుంచి కోడలుగా మార్చుకొని, అత్తగారికి సహాయంగా ఉండటం ప్రారంభించింది. ఇంతకాలంగా స్కూలు మానేసినా, తండ్రిదగ్గర తెలుగు లెక్కలు నేర్చుకుంటూనే ఉంది. హోదా మారినా, తన తండ్రిదగ్గర శిష్యరికం మానలేదు.

అప్పటికి ఊళ్లో స్కూలుఫైనల్ ముగించి, పట్నంలో ఇంటర్మీడియట్ ఫస్ట్‌క్లాసులో పాసైన రామచంద్రమూర్తి ఫిజిక్స్ ఆనర్స్‌లో చేరడానికి విశాఖపట్నం వెళ్లే సన్నాహంలో ఉన్నాడు. చదువులో కొడుకు పట్టుదలపై పూర్తి విశ్వాసమున్న వెంకటచలం దంపతులు, సీతమహాలక్ష్మిని కూడా పంపించాలనే నిర్ణయించారు. ఓ ముహూర్తాన వారు కోడలిని తీసుకెళ్ళి, వాల్తేరులో ఓ చిన్న ఇల్లు కుదిర్చి కాపరం పెట్టించి వచ్చారు. వేలువిడిచిన మేనత్త ఒకామె కొన్ని రోజులపాటు వారికి తోడుగా ఉండి, వెళ్లిపోయింది.

పట్నంలో రెండేళ్లు ఉండటం, వయస్సు కొంత పెరగడంతో రామచంద్రమూర్తి ఆలోచనల్లో కూడా ఎంతో మార్పు వచ్చింది. పెళ్లి అంటే ఏమిటో తెలియని పసితనంలోనే తమకు వివాహమైనా, ఇప్పుడిప్పుడే వివాహం, భార్య, భవిష్యత్తు మొదలైన విషయాలను గురించి తెలియడం ప్రారంభమైంది. కనుకనే, తన భార్య కూడా, ఉద్యోగాలు చేయనవసరం లేకపోయినా, బాగా చదువుకోవాలన్న ఆలోచన అతనిలో బలం పుంజుకుంది. సెలవులలో ఇంటికి వచ్చినప్పుడు, "చదువుకుంటావా?" అంటే ఎంతో ఉత్సాహం చూపించింది. స్వగ్రామంలో ఉంటే సీతమహాలక్ష్మి ప్రయివేటుగా చదువుకొనే అవకాశాలు తక్కువ అని లోలోపలే నిస్పృహ చెందుతున్న రామచంద్రమూర్తికి, విశాఖపట్నంలో కాపరం పెట్టాలని తన తలిదండ్రులు సూచించడం ఎంతో ఆనందం కలిగించింది. తను దగ్గరుండి ఆమెకు చదువు చెప్పవచ్చు. పరీక్షలకు తయారు చేయగలనన్న ధైర్యం అతనికుంది.

విశాఖపట్నం వెళ్లిన కొద్దిరోజులకే మెట్రిక్యులేషన్ పరీక్ష వివరాలు, సిలబస్, పాఠ్య పుస్తకాలు సేకరించాడు. కొద్దిరోజులలో సీతమహాలక్ష్మి మెట్రిక్యులేషన్ విద్యార్థిని. పుస్తకాలన్నీ రెండేళ్లక్రితం వరకు తను చదివినవే కావడంతో, ఆమెకు సులువుగానే పాఠాలు చెప్పడం ప్రారంభించాడు రామచంద్రమూర్తి. అతని పట్టుదలకు దీటుగా సీతమహాలక్ష్మి కూడా శ్రద్ధగా పాఠాలు చదువుకోటం ప్రశ్నలకు సమాధానాలు రాయడం ప్రారంభించింది. లక్ష్యం సాధించాలన్నదే వారిద్దరి ఆశయం. నాలుగేళ్లు ఇట్టే గడిచిపోయాయి. రామచంద్రమూర్తి ఆనర్స్, ఎం.ఎస్.సిలలో యూనివర్సిటీ ఫస్ట్‌గా బహుమతులు గెల్చుకోవడంతో పాటు, సీతమహాలక్ష్మి మెట్రిక్యులేషన్, ఇంటర్మీడియట్ పరీక్షలలో పాస్ అయింది.

అతను రిసర్చిలో చేరాడు. ఆమె బి.ఏ. పరీక్షకు తయారీ ప్రారంభించింది. మూడేళ్లు గడిచాక అతను డాక్టర్ రామచంద్రమూర్తి ఎం.ఎస్.సి., పిహెచ్.డి. అయ్యాడు. ఆమె సీతమహాలక్ష్మి బి.ఏ. అయింది. తనకు డాక్టరేటు వచ్చిందన్న దానికంటే, కవలపిల్లల తల్లి అయిన తన భార్య బి.ఏ. డిగ్రీ గెల్చుకొన్నదన్న విషయమే అతనికి ఎక్కువ ఆనందాన్ని కలిగించింది. ఇద్దరూ కలిసే, ఆ సంవత్సరం కన్వొకేషన్‌లో గౌన్లు వేసుకుని డిగ్రీలు పుచ్చుకున్నారు.

ఢిల్లీలో పరిశోధనా సంస్థలో చేరిన డాక్టర్ రామచంద్రమూర్తి పరిశోధనలు, సభలు, సమావేశాలపై దేశదేశాలు తిరిగివస్తున్నారు. అధికార బాధ్యతలు, సభలు, సమావేశాలు, సలహా సంప్రదింపుల కారణంగా అధిక సమయం వెచ్చిస్తున్న రామచంద్రమూర్తికి, ఇంటిపట్ల, భార్యపట్ల తగినంత సమయం కేటాయించలేకపోతున్నారు. క్రమ క్రమంగా అతను పై పదవులకు ఎదుగుతూనే ఉన్నాడు. కానీ క్రమంగా సీతమహాలక్ష్మిని ఒంటరితనం ఆవరిస్తోంది. ఆమెభర్తకు చెప్పుకోలేని బాధలివి. రామచంద్రమూర్తి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించాడు. ఎందరికో మార్గద

ర్శకుడయ్యాడు. కొన్ని వందలమంది ప్రాతఃస్మరణీయుడు అని భావించేరీతిలో ఎదిగాడు. అయితే భార్యకు రోజుమొత్తంలో ఎన్ని గంటలు అందుబాటులో ఉంటున్నాడు. ఎన్ని గంటలు ఇద్దరూ కలసి కష్టసుఖాలు మాట్లాడుకొంటున్నారనే విషయం అతనికెప్పుడూ స్ఫురించనే లేదు. భర్త ఔచిత్యమే తన సంతృప్తిగా కాలం గడిపే సాధ్వీమణి సీతమహాలక్ష్మి.

పదవీవిరమణ చేసిన తర్వాత హైదరాబాదులో చిన్న ఇల్లు కట్టించుకుని స్థిరపడ్డారు డాక్టర్ రామచంద్రమూర్తి దంపతులు. పేరుకు పదవీ విరమణ చేసినప్పటికీ సభలు, సమావేశాలు, సలహా సంప్రదింపులంటూ ఇంకా ఆయనను దేశం నలుమూలల నుంచి ఆహ్వానిస్తూనే ఉన్నారు. అయినా వెళ్ళివస్తూనే ఉన్నారు.

నిరాడంబరుడైన రామచంద్రమూర్తి కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు పట్టుబట్టిన కారణంగా వివాహ స్వర్ణోత్సవాలను కాదనలేకపోయారు-అదీ వాళ్ళు సంతృప్తి పడతారనే భావంతోనే!

*** *** ***

ఆనాటి వేడుకలన్నీ ముగిసి, విందుభోజనాలు అయ్యేసరికి బాగా పొద్దుపోయింది. బంధుమిత్రులు, అభిమానులు అంతా సెలవుతీసుకుని వెళ్ళిపోయారు. దూరాల నుంచి వచ్చిన దగ్గరి బంధువులు ఐదారుగురు మాత్రం ఆ రాత్రికి అక్కడే ఉండిపోయారు. ఉత్సవాలు ఎంతో ఘనంగా జరిగినందుకు, ఆహ్వానించిన వారంతా వచ్చినందుకు అందరూ సంతోషించారు.

మర్నాటి ఉదయమే కాఫీ తాగి ఇద్దరు కొడుకులు, ఇద్దరు అల్లుళ్ళు భార్యాబిడ్డలను తీసుకొని పాత మిత్రులను పరామర్శించడానికి వెళ్ళిపోయారు. మిగిలిన బంధువులూ వెళ్ళిపోయారు. వంటమనిషి వంటింట్లో ఉంది. ఇంట్లో ఇంకేమీ సందడి లేదు. ఆ ప్రాంతంలో రోడ్డు తవ్వుతూండే కేబుల్స్ తెగిపోవడంతో టెలిఫోన్ కూడా మోగడం లేదు. 'నవదంపతులు' హాలులో కూర్చొన్నారు. ఆ ఏకాంతంలో నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఆమె అంది.

''బావా పిల్లలంతా రేపు ఉదయం వెళ్ళున్నారు. నెల రోజులుగా ఇల్లంతా ఎంతో సందడిగా ఉంది. రేపటి నుంచీ మళ్ళీ మామూలే!'' ఆమె గొంతులో ఏదో బాధ వ్యక్తమైంది. ఆమె మాటలు వాడి బాణాల్లా రామచంద్రమూర్తి గుండెను తాకాయి.

పదిహేనేళ్ళుగా ఇంట్లో ఉంటున్నది తామిద్దరే. అయినా ఒంటరితనం అనే భావం రామచంద్రమూర్తికి ఏకోశానా లేకపోయింది. కొడుకులిద్దరూ డాక్టర్లు, కోడళ్ళూ డాక్టర్లే. పై చదువులకని వెళ్ళిన వారంతా అమెరికాలోనే స్థిరపడిపోయారు. ఈనాడు వారు అమెరికా పౌరులు. ముగ్గురు మనవలు జన్మతః అమెరికా పౌరులు. పెద్దల్లుడు ఇంజనీరు. పెళ్లయిన రెండేళ్ళకే ఆస్ట్రేలియా వలస వెళ్లాడు. చిన్నల్లుడు డాక్టరు. ఇంగ్లండులో స్థిరపడ్డాడు. ఎవరికి వీలయినప్పుడు వారు పిల్లల సెలవులు కలుపుకొని నాలుగైదేళ్ళకోసారి వచ్చి వారితో కొన్ని రోజులు గడిపి వెళ్తుంటారు. ఇక ఇంట్లో మిగిలింది తామిద్దరే. అయినా రామచంద్రమూర్తికి 'ఒంటరితనం' అనే ఆలోచన రానేలేదు. పైగా ఆఫీసువనులు, సభలు సమావేశాలు అంటూ రామచంద్రమూర్తిగారు తరచు వారాలతరబడి బయటి ఊళ్లకు వెళ్ళి వస్తున్నప్పటికీ, తాను ఒంటరిదాన్ని అని సీతమహాలక్ష్మగారు ఏనాడూ భావించనే లేదు.

కాని ఎందుకో పిల్లలంతా వెళ్ళిపోతున్నారంటే, పైకి స్పష్టంగా వ్యక్తం చేయకపోయినప్పటికీ, ఒంటరితనం ఆమె మాటలలో గోచరిస్తున్నది. ''పిల్లలు రేపు వెళ్లిపోతార''ని సీతమహాలక్ష్మి అన్నప్పుడు రామచంద్రమూర్తి కూడా మొట్టమొదటిసారిగా ఎందుకో ఒంటరితనం అనుభవించారు. కాని పైకి కనిపించనీయలేదు.

''పిల్లలంతా వృద్ధిలోకి వచ్చారు. వారి పని ఒత్తిళ్లు వారి కుంటాయి. మన వాళ్లకు కాలేజీ ఉంటుంది గదా! మరి వెళ్లకపోతే ఎట్లా?'' అని నర్దిచెప్పారు. పైకి ఎంతో గంభీరంగా బింకంగా అంటున్నప్పటికి రామచంద్రమూర్తి గొంతులో ఏదో ఆవేదన గోచరిస్తూనే ఉంది అది ఆమె గమనించక పోలేదు.

మర్నాటి ఉదయమే పిల్లలంతా తమ దేశాలకు ప్రయాణమై వెళ్లిపోయారు. తమ ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకోమని వారానికొ సారయినా తప్పకుండా టెలిఫోను చేస్తుండమని మరీ మరీ చెప్పివెళ్లారు. వచ్చేతమతో కొన్నాళ్లు గడపమని తల్లిదండ్రులను వారు ఆహ్వానించారు. మనసులో దిగులుగా ఉన్నప్పటికీ పైకి ఏ మాత్రం కనబడనీయకుండా విమానాశ్రయంలో పిల్లలకు వీడ్కోలు చెప్పి ఇంటికి తిరిగి వచ్చారు. రామచంద్రమూర్తి దంపతులు.

ఆ పూట భోజనం సహించలేదు. రెండు మెతుకులు కెలికి లేచారు. ఎవరూ ఏమీ మాట్లాడటం లేదు. భోజనాలయిన తర్వాత గదిలో కూర్చున్నారు. మనసులో చెప్పలేదని బాధను బయటకు వెళ్లగక్కేయాలన్న ఆలోచనవచ్చినా, మాట పెగలడం లేదు. ఒంటరితనం గురించి పెద్దగా ఆలోచించకపోయినా, రామచంద్రమూర్తి మనసులో ఏవో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ఓ క్షణం పోయాక ఆయనే నిశ్శబ్దాన్ని భంగం చేశారు.

''సీత! ఇన్నేళ్ళుగా నీకు తీరని అన్యాయం చేశాను. 50 సంవత్సరాలుగా కలిసి కాపరం చేస్తున్నా ఏ అరమరికలు లేకపోయినా నా పనుల మధ్య నీవున్నావని కూడా పెద్దగా ఆలోచించలేదు. ఏదైనా కాలాన్ని కూడా. నా పనులకే వెచ్చించాను. గడచిన కాలం తిరిగిరాదు కాని, ఇక ముందు మొత్తం సమయం నీదే, మనం ఒక్క రోజు కూడా ఒకరినొకరు విడిచి ఉండము. ఈ క్షణం నుంచి నీకు నేను, నాకు నీవు. మనం ఒంటరి వాళ్లం గాదు' అన్నారు దృఢంగా. ఆమె కళ్ళుచెమర్చాయి. కొన్ని సంవత్సరాలుగా మనసు పొరల్లా గూడు కట్టుకున్న ఆవేదన ఆమెకు తెలియకుండానే పెల్లుబికింది. ఇద్దరి మధ్యా కొన్ని నిమిషాల మౌనం.

సాయంత్రానికి ఇంటి తలుపుమీద ఓ బోర్డు తగిలించారు. ''పనితొందరలో ఉన్నారు. దయచేసి ఇబ్బంది పెట్టకండి'' అని రాసి ఉంది దానిపై.

రామచంద్రమూర్తి దంపతులు ఆ ఇంట్లోనే ఉంటున్నారు. తెల్లవారకముందే లేచి మార్నింగ్ వాక్కు వెళ్లి వస్తారు. రాత్రి భోజనాలయ్యాక కొంతసేపు అలా నడిచి వస్తారు. ఎవరింటికీ వెళ్లడం లేదు. ఎవరినీ ఆహ్వానించడం లేదు. ఎవరైనా వచ్చినా బోర్డు చూసి వారిని కలిసే ప్రయత్నం విరమించుకుని తిరిగి పోతున్నారు. టెలిఫోనులో ఎవరైనా పిలిస్తే, ఏదో పని తొందరలో ఉన్నానని, కనుక ఎవరినీ కలవడం లేదని సమాధానం చెప్తారు. సభలు, సమావేశాలకు వక్తగా రావాలని వచ్చిన ఆహ్వానాలను మర్యాద పూర్వకంగా తిరస్కరిస్తారు. ఇంటికి కావలసిన సరుకులు బ్యాంకు పనులు పనిమనిషే చూస్తుంటాడు.

అప్పుడప్పుడు కారులో బయలుదేరి వారాలతరబడి పుణ్యక్షేత్రాలు చూస్తుంటారు.

ప్రతినెలా ఒకసారి పిల్లలందరికీ తప్పక టెలిఫోను చేసి యోగక్షేమాలు విచారిస్తారు. పిల్లలు కూడా క్రమం తప్పక టెలిఫోను చేస్తుంటారు. అంతకు మించి వారు చేసే టెలిఫోన్లు కాని, వారికి వచ్చే టెలిఫోన్లు కాని మరేమీ ఉండవు. ఇంటిలో గతంలో మాదిరిగా ఆ ఇద్దరే నివసిస్తున్నారు. కాని ఇది వరకటి కంటె ఆ ఇంటిలో ఎంతో సందడిగా ఉంటున్నది. ఐదు దశాబ్దాల తమ జీవిత సుఖాలను వారు నెమరు వేసుకుంటుంటారు. చిన్నతనంలో తోటలో మామిడిచెట్టు పైకెక్కి సీతకు కాయలు కోసి పడేసిన సంఘటన, మొదలు అంతర్జాతీయ మహాసభలో తన ప్రసంగానికి సభికులు నిలబడి హర్షధ్వానాలు చేసినఘట్టన వరకు ఎన్నో విషయాలు పునశ్చరణ చేసుకుంటుంటారు. ముసి ముసి నవ్వులు, సిగ్గు దొంతరలు ఒకప్పుడు. పెద్దగా నవ్వులు మరొక సారి. వారిప్పుడు ఐదు దశాబ్దాల క్రితం నాటి స్థితికి తిరిగి చేరుకున్నారు. మానసికంగా మధ్యలో వచ్చిన అంతరాల దొంతరలు తొలిగిపోయాయి. వారి మాటలలో, నవ్వులలో, చేష్టలలో ఎలాంటి ఆందోళనలు, సంకోచాలు లేవు. అమాయకంగా మాట్లాడుకుంటూ, గత సంఘటనలను మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటుంటారు. అక్షరాలా ఇరవై నాలుగు గంటలూ ఒకరిని విడిచి మరొకరు ఉండరు. నూతన వధూవరులుగా ఉన్నప్పుడు కూడా అంతటి ఏకాంతాన్ని అనుభవించలేదు. అన్ని కబుర్లు చెప్పుకోలేదు. వివాహ స్వర్ణోత్సవం వారి జీవితాలకు సిసలైన అర్థం చెప్పింది. ఇప్పుడు వారికి ఒంటరితనం అనే భావం కనుచూపుమేరలో కనిపించదు. ఎంతో ఎత్తుకు ఎదిగి ఎందరెందరితోనో పరిచయాలు ఉన్నానాడు 'ఒంటరితనం' మాటకు భయ కంపితుడైన రామచంద్రమూర్తి ఇప్పుడు ఆ సంబంధాలన్నీ వదిలేసి భార్య సహచర్యంలో ఒంటరితనాన్ని దూరం చేశాడు. ఇక సీతమహాలక్ష్మమ్మ ఆనందం గురించి చెప్పేదేముంది.'

---

*ఒక ఇంట్లోంచి బిగ్గరగా కేకలు వినిపించసాగాయి. జనమంతా పోగయ్యారు- గంటసేపట్నుంచి అలా ఆ జగడం కొనసాగింది. విషయమేమిటో కనుక్కునేందుకు ఓ పెద్దమనిషి జోక్యం చేసుకుని, "ఏమిటీ గొడవని" అనడిగాడు. "ఆ మూర్ఖుణ్ణి మందలిస్తున్నాను" అన్నాడు తండ్రి.*

*"ఎందుకు?"*

*"రేపు వాడి పరీక్షల రిజల్ట్స్ వస్తున్నాయి, నేనేమో ఈరోజే ఊరెళ్తున్నాను" విసుగ్గా చెప్పాడా తండ్రి.*

-మాధవి
హైదరాబాదు